వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్

VOICE OF
VANDE BHARATH

గురువారం, జులై 30, 2026

# పార్టీలకతీతంగా ఘనంగా బోనాల పండుగలు జరగాలి

◆ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఆషాఢ మాస–2026 బోనాల మహోత్సవాల సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ దేవాలయాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన రూ.53 లక్షల విలువైన 96 ఆర్థిక సహాయ చెక్కులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. శ్రీనగర్ కాలనీ డివిజన్‌లోని శ్రీ సత్యసాయి కళ్యాణ మండపంలో ఈ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. గత పాలకులు దేవాలయాలపై కూడా రాజకీయాలు చేశారని, మనం అలాంటి సంస్కృతికి తావులేకుండా నియోజకవర్గంలో బోనాల పండుగలను పార్టీలకతీతంగా, అంకితభావంతో, భక్తిశ్రద్ధలు మరియు సామరస్య వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఇంకా ప్రభుత్వ గుర్తింపు లేదా రిజిస్ట్రేషన్ పొందని దేవాలయాల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే, సొంత ఖర్చులతో వాటి ప్రక్రియ పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇన్‌చార్జి మంత్రి పొన్నం



ప్రభాకర్‌తో ప్రత్యేకంగా చర్చించి, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఆలయాలకు మరింత అధిక నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. బోనాల జాతరలు జరిగే ప్రతి ఆలయం వద్ద మున్సిపల్, పోలీసు, విద్యుత్, జలమండలి, పారిశుద్ధ్య తదితర అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక ఉత్సవాలకు పెద్దపీట వేస్తూ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వర్షాకాలంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో రైతన్నల మొహాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, అమ్మవారి దివ్య ఆశీస్సులు జూబ్లీహిల్స్ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు విఠలయ్య, శ్రీదేవి, ఈవో శ్రీనివాస శర్మ, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నలుగురు సీఎం సహకారంతో రాజీవ్ పార్క్ అభివృద్ధి

▪ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి

**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సంగారెడ్డిలోని రాజీవ్ పార్క్ ఏర్పాటు, అభివృద్ధి వెనుక నలుగురు ముఖ్యమంత్రుల సహకారం ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి తెలిపారు. గురువారం ఆయన రాజీవ్ పార్క్‌ను ఆకస్మికంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. పార్క్ అంతా కలియతిరుగుతూ జరుగుతున్న, ఇంకా జరగాల్సిన పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు, ఫౌంటెన్ పునరుద్ధరణ పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజీవ్ పార్క్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఆ తర్వాత సీఎం రోశయ్య ఈ పార్కుకు శంకుస్థాపన






చేయగా, సీఎం కిరణ్ కుమార్ రెడ్డి దీన్ని ప్రారంభించారని తెలిపారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోకపోవడంతో రాజీవ్ పార్క్ పూర్తిగా దెబ్బతిని, నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ టి.కె.శ్రీదేవి సహకారంతో.. మొదటి దశలో రూ.3 కోట్ల నిధులతో రాజీవ్ పార్క్‌ను సుందరీకరించి అభివృద్ధి చేశామని జగ్గారెడ్డి వెల్లడించారు. త్వరలోనే మరో రూ.6 కోట్ల నిధులతో మరింత అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ పార్కును తిరిగి ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిశన్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్, శ్రీహరి, కౌన్సిలర్లు మహేష్, నవాజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# గాంధీ యూపీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ గురువారం గాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ, ఫార్మసీ స్టోర్, వివిధ రికార్డుల నిర్వహణ మరియు పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అర్హులైన ప్రతి గర్భిణీ స్త్రీకి మరియు శిశువుకు సకాలంలో టీకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. జూలై నెల 'డెంగ్యూ అవగాహన మాసం' సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా వంటి దోమకాటు వ్యాధుల నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలి. నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్ సీడీ) కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతంగా



అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ఫలాలు ప్రతి అర్హుడికి అందేలా సిబ్బంది అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత వైద్యాధికారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కోరుట్ల ఇంచార్జి డాక్టర్ రఘు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జిగా నియమితులైన డాక్టర్ రఘు.. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మెట్పల్లి, కోరుట్ల నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, అనుచరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కవితను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ "నాపై విశ్వాసంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. కోరుట్ల నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఈ నియామకాన్ని భావిస్తున్నాను. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తాను." అలాగే పార్టీ అనుబంధ సంఘాలను మరింత శక్తివంతం చేస్తూ, సబ్బండ వర్గాలకు సముచిత అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు, విద్యార్థులతో కలిసి ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు కోరుట్ల నియోజకవర్గ ప్రజల సహకారంతో ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తిస్తానని డాక్టర్ రఘు ధీమా వ్యక్తం చేశారు.

# ఘనంగా 'ప్రణామ్ ప్రివిలేజ్ కార్డు' ప్రారంభం

## అమీర్‌పేట్ ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్‌లో ఆవిష్కరించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్‌లో వృద్ధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ప్రణామ్ ప్రివిలేజ్ కార్డు'ను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ గురువారం ఘనంగా ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఈ కార్డును అందుబాటులోకి తెచ్చినట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ప్రాధాన్యత వైద్య సేవలు: సీనియర్ సిటిజన్స్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యంత ప్రాధాన్యతతో వైద్య సేవలు అందజేస్తారు. హెల్త్ చెకప్‌లపై ప్రత్యేక రాయితీలు, ఓపీ–ఐపీ సేవల్లో ప్రత్యేక సౌకర్యాలు మరియు ఫార్మసీలో డిస్కౌంట్లు లభిస్తాయి. మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఎమోషనల్ సపోర్ట్, ఫిజియోథెరపీ సేవలతో పాటు సంవత్సరానికి ఒకసారి ఉచితంగా కంటి మరియు దంత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. వృద్ధులను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయమని అన్నారు. వారి ఆరోగ్యాలను కాపాడేందుకు చేపడుతున్న ప్రతి ప్రయత్నం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ల కోసం ఈ ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని చేపట్టిన ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆసుపత్రి యాజమాన్యం ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో రీజినల్ సీఈఓ నిలేష్ గుప్తా, క్లస్టర్ సీఈఓ హరికుమార్ రెడ్డి, ఏసీపీ రాఘవేంద్రరావుతో పాటు కృష్ణకాంత్ పార్క్ సీనియర్ సిటిజన్స్, అమీర్‌పేట్ పరిసర ప్రాంతాల సీనియర్ సిటిజన్లు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.